నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: ఆఫీసర్స్ కాలనీ, ఆర్కే.పురం 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుండి 11.30 గంటల ఆశా ఆఫీసర్స్ కాలనీ, ఏఎస్‌వి. ఆఫీసర్స్ కాలనీ, గాంధీనగర్, హరిజన బస్తీల్లో అదేవిధంగా ఉదయం 11. 30 గంటల నుండి మధ్యాహ్నం 12. 30 గంటల వరకు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ హస్పిటల్, స్టేషన్ వర్క్ షాప్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

టుబాకో బజార్‌లో మరు గుదొడ్ల నిర్మాణానికి చర్యలు

సనత్‌నగర్: టుబాకో బజార్‌లో నూతన టాయిలెట్స్ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. జనరల్ బజార్‌లోని టుబాకో బజార్‌కు చెందిన క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జనరల్ బజార్‌లోని నాలుగు ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అమ్మనబ్రోలు ప్రకాష్, సభ్యులు జంగిటి మురళి, రామ్మోహన్‌యాదవ్, చౌకాని తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సివిల్స్ సర్వీసెస్ అకాడమిలో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ కాలేజీల్లో చదివే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్ పేర్కొన్నారు. యూపీఎస్సీ సివిల్స్ (ప్రిలిమ్స్)తో పాటు గ్రూప్–1, 2 ఇతర ఉద్యోగాల పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

'ఉద్యోగాల భర్తీని కేటీఆర్ అడ్డుకున్నారు'




ఓయూలో మాట్లాడుతున్న చనగాని దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ఉద్యోగాల భర్తీని మాజీ మంత్రి కేటీఆర్ అడ్డుకున్నారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చనగాని దయాకర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా నియమించినందుకు ఓయూలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ధన్యవాద సభలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన గ్రంథాలయ చైర్మన్ డా.రియాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోనే సామాజిక ఏజెండా ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షులు మెడ శ్రీను, మోహన్, సతీష్, భార్గవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవాలయ ఇన్‌చార్జి ఈఓగా మహేందర్‌గౌడ్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా మహేందర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈఓగా పనిచేస్తున్న ఎం.కృష్ణ సెలవుపై వెళ్లడంతో సికింద్రాబాద్ మోండా మార్కెట్ గ్రెయిన్ బజార్ ధర్మశాల గ్రేట్ వన్ ఈఓగా పని చేస్తున్న మహేందర్‌గౌడ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



అవగాహన కల్పిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి, సిబ్బంది

గాంధీఆస్పత్రి : రక్తదానంపై అపోహలు విడనాడాలని సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం గాంధీఆస్పత్రి ప్రాంగణంలో చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదానంతో ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి పునర్జన్మ ప్రసాదించవచ్చన్నారు. అనంతరం గాంధీ బ్లడ్‌సెంటర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న పలువురికి రిస్ట్‌బ్యాండ్‌లు, సర్టిఫికెట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ రజనీ, సరిత, మీనాక్షి, నజీమ్, బ్లడ్‌సెంటర్ సిబ్బంది శ్రవణ్‌కుమార్, వెంకటేష్‌నాయక్, ఫరీదుద్దీన్, సునీత, దేవేందర్, మల్హార్, బాబామహ్మద్, ఖాజాలు పాల్గొన్నారు.

భవన నిర్మాణం..పునాదులకే పరిమితం

- ఉన్న భవనం నేలమట్టం చేసిన పాలకులు
- సీతాఫల్‌మండిలో విద్యార్థుల ఇబ్బందులు



పాఠశాల, కళాశాలల కోసం నిర్మించనున్న భవన నమూనా చిత్రం



రేండేళ్లుగా పునాది రాళ్లకే పరిమితమైన విద్యాసంస్థల భవన నిర్మాణం

సికింద్రాబాద్: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. తరగతులు ప్రారంభం కావడంతో అన్ని ప్రాంతాల విద్యార్థులు నూతనోత్సాహంతో ఉండగా సీతాఫల్‌మండి ప్రాంత విద్యార్థులకు మాత్రం కష్టాలు ఈ విద్యా సంవత్సరం కూడా వ్యయప్రయాసలు తప్పేట్టు లేవు. అధునాతన పాఠశాల భవన నిర్మాణం పేరుతో ఉన్న భవనాన్ని నేలమట్టం చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు విద్యా సంవత్సరాలు బయటి ప్రాంతాల్లో విద్యాభ్యాసానికి వెళ్లిన విద్యార్థులు ఈ ఏడాది కూడా అవే ఇబ్బందులు భరించాల్సి వచ్చింది.

- సీతాఫల్‌మండిలో విశాలమైన స్థలంలో అన్ని విధాల వసతులు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం సీతాఫల్‌మండికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఇదే పాఠశాల భవనంలో ఏర్పాటు చేశారు. రెండు కళాశాలలకు, పాఠశాలకు తరగతి గదులు సరిపోక అప్పటి నుంచే విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

అధునాతన భవనాల పేరుతో....

పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇక్కడ మూడు విద్యా సంస్థలకు కలిపి అధునాతన భారీ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 29.75 కోట్ల నిధులు మంజూరు చేసింది.

- కొత్త భవనాల నిర్మాణం కోసం సీతాఫల్‌మండిలోని విశాలమైన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను మొత్తంగా నేలమట్టం చేశారు. 2023 మార్చిలో పాఠశాల భవనాన్ని, ఆవెనుకే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని నేలమట్టం చేశారు. అదనపు గదుల నిర్మాణం కోసం పాఠశాల ప్రాగణంలో విశాలమైన స్థలం ఉన్నప్పటికీ భారీ భవనం నిర్మిస్తామని నేలమట్టం చేశారు.

తరగతులు చెల్లా చెదురు...

ఇక్కడి ప్రాథమిక, ఉన్నత పాఠశాల తరగతులను ఓయూకు అనుబంధంగా ఉన్న మోడల్ స్కూల్ భవనంలోకి బదలాయించారు. ఒకే భవనంలో అటు ఓయూ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఇటు సీతాఫల్‌మండి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల తరగతులు నిర్వహిస్తుండడంతో ఇబ్బందిగా మారింది.

- సీతాఫల్‌మండి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాత భవనంలోకి మార్చారు. ఇందులో అధ్యాపకులకు, తరగతులు, ప్రయోగశాల నిర్వహణకు ఎటువంటి సదుపాయాలు లేవు. అరకొర సదుపాయాల మధ్యే బోధనలు జరుగుతున్నాయి.
- మేడిబావి కమ్యూనిటీహాలులో జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. కేవలం నాలుగు గదుల్లో అన్ని కోర్సుల బోధనలు నిర్వహించక తప్పని పరిస్థితి ఈ భవనంలో నెలకొంది. విద్యార్థులు, అధ్యాపకులకు అన్నీ అవే గదులు ఉండడంతో ఇక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి.

సీతాఫల్‌మండి విద్యార్థుల సంఖ్య	
ప్రభుత్వ ప్రాథమిక	
ఉన్నత పాఠశాల	: 750
జూనియర్ కళాశాల	: 475
డిగ్రీ కళాశాల	: 575

పునాది గోడలకు పరిమితం...

పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసి కొత్త భవన నిర్మాణం పనులు ప్రారంభించి రెండేళ్లు దాటింది. పాఠశాల కూల్చివేతతో అధునాతన భవనం వస్తుందన్న స్థానికుల ఆనందం ఆదిలోనే ఆవిరైంది. కొత్త భవన నిర్మాణం అలా మొదలయ్యాయో లేదో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారడంతో ఏకంగా పాఠశాలను నేలమట్టం చేసిన కాంట్రాక్టర్ పునాది గోడలు నిర్మించి చేతులెత్తేశాడు.

సీఎం దృష్టికి తీసుకెళ్లాం



గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం, పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయిన తీరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవలి శాసనసభ సమావేశాల్లో సీఎంకు వినతిపత్రం అందించాం. నిర్మాణ పనులు పూర్తిచేయించేందుకు సీఎం హామీ ఇచ్చారు. మరోమారు పరిస్థితిని సీఎం, అధికారులకు వివరించి వచ్చే విద్యా సంవత్సరంలోగా భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

–ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న చైర్మన్ ప్రకాశరావు తదితరులు

చిలకలగూడ : నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న స్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండవ శనివారం స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్నామని చైర్మన్ ప్రకాశరావు తెలిపారు. కరాటే రాజు, బిట్ల రఘునందన్, శ్రీనివాసగౌడ్, సతీష్, కృష్ణచారి, రవిలతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పూజలు చేస్తున్న శంకర భారతి

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయ 19వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ముగిశాయి. పుష్పగిరి శంకర భారతీ మహా స్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. శాంతి హోమం, మండప దేవత హోమాలు, అష్టోత్తర శతకళాభిషేకం, మహా పూర్ణాహుతి, వేదపండితుల ఆధ్వర్యంలో స్వస్తి తదితర పూజా కార్యక్రమాలతో ముగిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, గున్నాల ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఓల్డ్ కస్టమ్స్ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ నివాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ అన్నారు. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో శనివారం పర్యటించి స్థానికులతో మాట్లాడారు. మురుగుకాలువల డీసిల్టింగ్ పనులు ఇంకా పూర్తికాలేదని, వర్షాకాలం నేపథ్యంలో వెంటనే పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరారు. అలాగే మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని, విద్యుత్ సమస్యలు తీవ్ర ఉన్నాయని, వాటి పరిష్కరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ముస్లిం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న వారి మరణ ధృవీకరణ పత్రాలు జారీ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత విశాల్ సూదం, సలీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు సన్మానం



హోంగార్డు సాయిరామ్‌ను సన్మానిస్తున్న చిలకలగూడ పోలీస్ అధికారులు

చిలకలగూడ : చిత్తశుద్ధితో విధులు నిర్వహించిన హోంగార్డు సాయిరామ్ సేవలు అభినందనీయమని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్ అన్నారు. చిలకలగూడ ఠాణాలో నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించి పోలీస్ ఉన్నతాధికారుల మన్ననలు పొందిన సాయిరామ్‌కు బదిలీ అయింది. ఈ సందర్భంగా ఠాణా ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది సాయిరామ్‌కు ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఎస్ఐలు జ్ఞానేశ్వర్, సమీర్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల జాతర కోసం ముందస్తు నిఘా



మహంకాళి దేవాలయం వద్ద పరిశీలిస్తున్న ఎస్‌బీ డీసీపీ అపూర్వారావు

రాంగోపాల్‌పేట్: రాబోయే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర కోసం ముందస్తు నిఘాను పెంచాల్సిన అవసరం ఉందని స్పెషల్ బ్రాంచ్ డీసీపీ అపూర్వారావు సూచించారు. శనివారం అదనపు డీసీపీ ఏసీపీ రాంరెడ్డి, ఏసీపీ రామలింగరాజు, ఇన్‌స్పెక్టర్లు నాగేష్,సీతయ్య తదితరులతో కలిసి ఆమె దేవాలయంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అలాగే దేవాలయం చుట్టు పక్కల నుంచి కర్బలమైదాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి ఎన్ని పని చేస్తున్నాయి, ఎన్ని చేయడం లేదు అనేది స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యూ లైన్లు ఎక్కడెక్కడ ఎన్ని ఏర్పాటు చేస్తారని తెలుసుకున్నారు. ఎస్బీ అధికారులు ఇప్పటి నుంచే నిఘాను పెంచడంతో పాటు అప్రమత్తంగా ఉంటూ ప్రతి రోజు మానిటరింగ్ చేయాలని సూచించారు. స్పెషల్ బ్రాంచ్ పనితీరును కూడా అడిగి తెలుసుకున్నారు.

సీఎంను కలిసిన కోట నీలిమ



సనత్‌నగర్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కోట నీలిమ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఆమె చర్చించారు.

24న ఆర్టీసీ ఉద్యోగుల బీసీ మహాసభ



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన ప్రతిక అందిస్తున్న ఆర్టీసీ బీసీ మహాసభ నాయకులు

సికింద్రాబాద్: కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమార్గం చూపించడానికి ఈ నెల 24న నిర్వహించనున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నామని సంఘం సికింద్రాబాద్ రీజియన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్‌ను మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరువావాలని కోరామని చెప్పారు. మహాసభలో ఆర్టీసీ బీసీ ఉద్యోగులు సమస్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నట్లు చెప్పారు. బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, ప్రతినిధులు కృష్ణ, వెంకటయ్య, సీవీ రావు, సంపత్, పాండు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బేగంపేట డివిజన్ భగవంతాపూర్‌కు చెందిన గౌతమికి చికిత్స కోసం మంజూరైన పత్రం (ఎల్‌ఓసీ) శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. గౌతమి తండ్రి పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రయాణ మృతులకు నివాళులు



అతితానగర్ పార్కులో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాద మృతులకు బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ నాయకులు శనివారం నివాళులు అర్పించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో లలితానగర్ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మౌనం పాటించి విమాన ప్రమాద మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హర్షకిరణ్ , హన్మంతు ముదిరాజ్, కొమురయ్య, వనమాల కిరణ్ , సత్యనారాయణ, నాగారాణి, భిక్షపతి, రాజకుమార్ , రాజు పాల్గొన్నారు.

మూలం సంతను ఆదరించాలి



మూలం సంతలో ఏర్పాటు చేసిన వివిధ రకాలైన స్టాల్స్

లాలాపేట: ప్రకృతి గ్రామీణ ఉత్పత్తుల సమాహారమే మూలం సంత అని తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ అన్నారు. గ్రామభారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణాహాల్లో శనివారం నిర్వహించిన 12వ మూలంకు విశేష స్పందన లభించింది. దాదాపు 75 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. శ్రీధర్ ముఖ్యతిధిగా హాజరై మూలం సంతను ప్రారంభించి మాట్లాడారు. రైతులను ప్రోత్సహించేందుకు ఈ మూలం సంతలో ఏర్పాటు చేసిన గ్రామీణ వ్యవసాయ గోఆధారిత వస్తువులను ఆదరించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామభారతి ఉపాధ్యక్షులు ఉట్నూరి లింగం గౌడ్, రాజమౌళి, జాయింట్ సెక్రటరీ బండి సురేష్ గౌడ్, శివకుమార్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అడ్డంకులను దీటుగా ఎదుర్కోవాలి



హెచ్‌పీఎస్ స్నాతకోత్సవంలో దర్శకుడు రాధాకృష్ణ జాగర్లమూడి

సనత్‌నగర్: లక్ష్య సాధనలో ఎదురయ్యే అడ్డంకులను దీటుగా ఎదుర్కొని పట్టుదలతో ముందుకుసాగినప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుందని ప్రముఖ సినీ దర్శకులు, రచయిత రాధాకృష్ణ జాగర్లమూడి అన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో నిర్వహించిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాధించాలనే కసి, పట్టుదల ఉంటే ఎంతటి కష్టాన్నైనా అవలీలగా దాటవచ్చని చెప్పారు. చదువు ఒక్కటే కొలమానం కాదని, అన్ని రంగాల్లో రాణించేందుకు నిరంతరం శ్రమిస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం 12వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ ప్రిన్సిపాల్ స్కండ్‌బాలి, హెచ్‌పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లీకుమారుడి అదృశ్యం



గాంధీఆస్పత్రి : రెండేళ్ల కుమారునితో సహా తల్లి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన ప్రశాంత్, స్వప్నలు భార్యభర్తలు. వీరికి రెండేళ్ల కుమారుడు అభిలాష్ ఉన్నాడు. ప్రశాంత్ కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం గతనెలలో గాంధీఆస్పత్రిలో చేర్పించారు. భార్య స్వప్నతోపాటు కుటుంబసభ్యులు సేవలు అందించారు. ప్రశాంత్ కాలుకు అయిన గాయం తీవ్రం కావడంతో సర్జరీ చేసిన వైద్యులు అతని ఎడమకాలిని తొలగించారు. ఈ క్రమంలో భార్య స్వప్న ఊరికి వెళ్లి డబ్బు తెస్తానని చెప్పి కుమారుడిని తీసుకొని ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లింది. ఈనెల 3వ తేదిన ప్రశాంత్ డిశ్చార్జ్ అయి ఊరికి వెళ్లగా స్వప్న అక్కడకు రాలేదని తేలింది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ స్వప్న(25), కుమారుడు అభిలాష్ (2) ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం చిలకలగూడ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, తల్లికుమారుల ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.





వైద్య విజ్ఞానాన్ని ఇతర వైద్యులతో పంచుకోవాలి

– కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: అందుబాటులోకి వస్తున్న సరికొత్త వైద్య విధానాలు ఇతర వైద్యులతో ఎప్పటికప్పుడు పంచుకోవాలని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. సీనియర్ కన్సల్టెంట్, న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ కుమార్ పాణిగ్రాహి తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రాక్టీస్ సమయంలో కొన్ని కొత్త విషయాలు తెలుస్తాయని వాటితో పాటు మన అనుభవాన్ని బట్టి వైద్యం చేస్తామన్నారు. ఆ సమయంలో కొత్త విషయాలు తెలుస్తాయని చెప్పారు కిమ్స్ ఆస్పత్రి న్యూరో రిహాబిలిటేషన్ విభాగాధిపతి డాక్టర్ అజయ్‌కుమార్ మిద్దె, కింగ్ ఖాలీద్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జయశంకర్ తెడ్ల పాల్గొన్నారు.

గద్దర్ అవార్డులను వ్యతిరేకించడం సిగ్గుచేటు

ఉస్మానియా యూనివర్సిటీ: గద్దర్ సినీ అవార్డులను బీజేపీ నాయకులు వ్యతిరేకించడం సిగ్గుచేటు అని టీఎస్‌పీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ వలిగొండ నరసింహ ధ్వజమెత్తారు. శనివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ తాడిత, పీడిత ప్రజల చైతన్యం కోసం తన ఆట, పాటలతో చైతన్యపరచిన గద్దర్ పేరిట అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379